క్లుప్తంగా

శ్రీవారి సేవలో భూమన దంపతులు



తిరుమల: టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకర రెడ్డి సోమవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. తన సతీమణితో కలిసి దర్శనానికి వచ్చిన ఆయనకు ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనం అనంతరం పండితులు వేద ఆశీర్వచనాలు అందించారు. అధికారులు లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు.

దోబీఘాట్ స్థలం ఆక్రమణపై ఫిర్యాదు



తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న సీపీఎం నేతలు

తిరుపతి రూరల్: మండలంలోని వేదాంతపురం గ్రామ రెవెన్యూ లెక్క దాఖలా సర్వే నంబర్ 2014లోని 0.56 సెంట్ల భూమిని రజకుల దోబీఘాట్ కోసం కేటాయించారని, ఆ స్థలాన్ని ఆక్రమించి అక్రమంగా ఇల్లు కట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని సీపీఎం నేతలు డిమాండ్ చేశారు. సోమవారం తహసీల్దార్ రామాంజులు నాయక్‌ను కలిసి కలిసి వినతిపత్రం ఇచ్చారు. వారు మాట్లాడుతూ, విలువైన ప్రభుత్వ భూమిని ఆ పంచాయతీ మాజీ సర్పంచ్ చిరంజీవిరెడ్డి, ముదిరాజ్ చంద్ర కబ్జా చేసి ఇల్లు కట్టారని, ఆక్రమణల నుంచి దోబీఘాట్ స్థలానికి విముక్తి కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం తిరుపతి రూరల్ కార్యదర్శి కే.సుమన్, సీఐటీయూ జిల్లా నాయకులు చిన్నబాబు, రజక సంఘం అధ్యక్షులు శంకర్, విజయ్, ధన, మధుకుమార్ పాల్గొన్నారు.

పౌర్ణమి పూజలు



విశేష అలంకరణలో స్వామివారు

రామచంద్రాపురం: మండలంలో రేకలచేను సమీపంలోని శ్రీ జన్మస్థల శివాలయంలో సోమవారం పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామివారికి ఆలయ ప్రధాన అర్చకులు కుంకుమార్చన, పాలాభిషేకం, పూజార్చనలు చేశారు. రాత్రి ఇస్కాన్ గురుశ్రీ హరి ప్రభు ఆధ్యాత్మిక ప్రవచనం చేశారు. శరద్ పౌర్ణమి వేడుకల ఉభయ దాతలు తాటి రెడ్డి వెంకటేష్ రెడ్డి దంపతులు మహిళలకు పసుపు, కుంకుమ, రవిక అందజేసి, భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సీజేఐపై దాడి తగదు

తిరుపతి లీగల్: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ గవాయిపై సోమవారం ఓ న్యాయవాది చెప్పు విసరడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్టు వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ ఉమ్మడి చిత్తూరు జిల్లా కో–ఆర్డినేటర్ ఎస్.రాజారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. దాడికి పాల్పడిన న్యాయవాదిపై దేశద్రోహం కేసు నమోదు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

మందుకొట్టి డ్రైవింగ్ చేస్తే ఇంతే..!

తిరుపతి లీగల్: తిరుపతిలో మద్యం తాగి నిర్లక్ష్యంగా వాహనాలు నడిపిన ఏడుగురికి ఒక్కొక్కరికి పదివేల రూపాయల చొప్పున జరిమానా విధిస్తూ తిరుపతి 4వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి గ్రంధి శ్రీనివాస్ సోమవారం తీర్పు చెప్పారు. తిరుపతి ట్రాఫిక్ పోలీసులు నగరంలో వాహనాల తనిఖీలు నిర్వహించి మందుబాబులను అరెస్ట్ చేశారు. వారిని కోర్టుకు హాజరు పరచగా జడ్జి జరిమానా విధించారు.

స్వదేశీ ఉద్యమంలో భాగస్వాములుకండి



మాట్లాడుతున్న మధుసూదన్

తిరుపతి కల్చరల్: ఆత్మ నిర్భర భారత్ పథం, స్వదేశీ ఉద్యమంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి జల్లి మధుసూదన్ పిలుపునిచ్చారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధాని మోదీ పిలుపు భారత ఆత్మ గౌరవానికి, సుసంపన్నతకు మార్గదర్శకమని పేర్కొన్నారు. ఖాదీ నుంచి బ్రహ్మోస్ వరకు, దీపం నుంచి డిజిటల్ యూపీఐ వరకు ప్రతి రంగంలో స్వదేశీ శక్తిని ప్రపంచం ముందుంచుతోందన్నారు. స్వదేశీ అంటే కేవలం వస్తువులు కాదని, ఆత్మగౌరవం, జాతీయ గర్వం, కార్మికుల శ్రమ, యువత ఆవిష్కరణల సమ్మేళనంతో స్వదేశీ ఉద్యమానికి జీవం పోస్తున్నాయన్నారు. దేశాన్ని వికసిత్ భారత్ వైపు నడిపిస్తూ భారతీయ వస్తువులు కొనడం, భారతీయులను ఆదరించడం, ప్రతి ఇంటా స్వదేశీ అనే భావనతో సాగే ఈ ఉద్యమంలో భాగస్వామ్యమైన దేశ ఖ్యాతిని చాటాలని కోరారు. సమావేశంలో బీజేపీ నేతలు మల్లం కుప్ప శేఖర్, నాగేంద్ర పాల్గొన్నారు.

లీకేజీతో అధ్వానం





ఓవర్ హెడ్ ట్యాంకు లీకవుతున్న మంచినీరు, లీకేజీతో అధ్వానంగా మారిన ట్యాంకు

మండలంలోని సీకే పల్లె పంచాయతీ గొల్లపల్లెలోని ఓవర్‌హెడ్ ట్యాంక్ నుంచి నిత్యం మంచినీరు లీకవుతూ ట్యాంకు చుట్టుపక్కల పారిశుధ్యం సమస్యలతో అధ్వానంగా దర్శనమిస్తోంది. ట్యాంక్ గోడలు పెచ్చులూడి, శిథిలావస్థకి చేరడం, మరోవైపు లీకేజీ ట్యాంకు చుట్టూ దుర్గంధం చిమ్ముతోంది. మురుగుకుంటగా మారిందని స్థానికులు వాపోతున్నారు. అధికారుల దృష్టికి ఫిర్యాదు చేసినా స్పందించడం లేదని మండిపడుతున్నారు. ఇకనైనా ఓవర్ హెడ్ ట్యాంకును శుభ్రం చేయడంతోపాటు లీకేజీని అరికట్టాలని కోరుతున్నారు.

- రామచంద్రాపురం

తపాలా సేవలు సద్వినియోగించుకోండి



తపాలా శాఖ సేవలపై మాట్లాడుతున్న ఆర్ముగం

తిరుపతి ఎడ్యుకేషన్ : తపాలా శాఖ వారోత్సవాల్లో ప్రత్యేక క్యాంపుల సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తిరుపతి ఈస్ట్ సబ్ డివిజన్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఆఫ్ పోస్టాఫీస్ కె.ఆర్ముగం కోరారు. సోమవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సోమవారం నుంచి జాతీయ తపాలా వారోత్సవాలను ప్రారంభించామని, 11వ తేదీ వరకు తమ పరిధిలోని అన్ని బ్రాంచ్ పోస్టాఫీసుల్లో ప్రత్యేక క్యాంపులను ఏర్పాటుచేసి తపాల పథకాలు, డిపాజిట్లు, ఇన్సూరెన్స్ పాలసీలు–వాటి పరిమితి, సేవింగ్స్ సర్టిఫికెట్లు, పొదుపు ఖాతాల ప్రారంభం.. ఇత్యాది వివిధ సేవలను అందిస్తామని తెలియజేశారు. అందిస్తున్నట్లు తెలిపారు. ఓటీపీ ఆధారిత డెలివరీ విధానం ద్వారా ఎవరైనా తపాలా ఆర్టికల్స్‌ను ఇంటి నుంచే బుక్ చేసుకునే వెసులుబాటు ఉందన్నారు.

అవిశ్వాస తీర్మానంపై నోటీసులు



సీఈఓకు నోటీసు అందజేస్తున్న ఎంపీటీసీ సభ్యులు

వడమాలపేట (పుత్తూరు): వడమాలపేట ఎంపీపీ విజయలక్ష్మిపై అవిశ్వాస తీర్మానం పెట్టేందుకు సోమవారం చిత్తూరు సీఈఓ, వడమాలపేట ఎంపీడీఓకు వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీ సభ్యులు నోటీసులు అందజేశారు. మండల అభివృద్ధికి ఎంపీపీ సహకరించడం లేదని, సభ్యుల విశ్వాసాన్ని కోల్పోయారని, ఫలితంగా అవిశ్వాస తీర్మానం పెట్టాల్సిన అవసరం ఏర్పడిందని నోటీసులో పేర్కొన్నారు. చట్టం ప్రకారం నోటీసు అందుకున్న 15 రోజుల్లోపు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి, అవిశ్వాస తీర్మానం నిర్వహించాలని సూచించారు. నోటీసులు అందజేసిన వారిలో వైస్ ఎంపీపీలు డీ.ఉపేంద్ర, వీ.లోకేష్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు ఎ.రవి, ఎ.ప్రతిమ, టి.పుష్పలత, ఇ.కనకమ్మ ఉన్నారు.

తగ్గిన జీఎస్టీని గుర్తించండి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న మెప్మా అధికారులు

తిరుపతి తుడా: తగ్గిన జీఎస్టీపై ప్రజలు మరింత అవగాహన పెంచుకోవాలని మెప్మా పీడీతో కలసి, అసిస్టెంట్ కమిషనర్ వరలక్ష్మిదేవి సూచించారు. స్థానిక మెప్మా కార్యాలయంలో సోమవారం సూపర్ జీఎస్టీ 2.0 తగ్గింపుపై కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం వివిధ ప్రాంతాల్లో దీనిపై అవగాహన కల్పించేందుకు కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం సూపర్ జీఎస్టీ తగ్గించిందని చెప్పారు. దీనిపై ప్రజలు అవగాహన పెంచుకుని లబ్ధి పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీపీఎంయూ సిబ్బంది కమ్యూనిటీ ఆర్గనైజర్లు, జీఎస్టీ అధికారులు పాల్గొన్నారు.

పాకాలలో..

పాకాల: జీఎస్టీ తగ్గింపును అందరూ సద్వినియోగం చేసుకోవాలని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్వీ.రమేశ్‌కుమార్ అన్నారు. సోమవారం కళాశాలలో జీఎస్టీపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కామర్స్ అధ్యాపకులు డాక్టర్ మాసిలామణి మాట్లాడుతూ, 12 శాతం ఉన్న జీఎస్టీని 5 శాతానికి కేంద్ర ప్రభుత్వం తగ్గించడంతో పలు వస్తువుల ధరలు తగ్గాయన్నారు. నోటుపుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు, ఎరేజర్ వంటి విద్యా సామాగ్రి ఎలాంటి జీఎస్టీ విధించలేదన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు చిట్టి కళావతి, మోహన్ బెహరా, ఆదిశేఖర్‌రెడ్డి, ఈశ్వర్‌బాబు, రమణమ్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎర్రచందనం స్మగ్లింగ్‌ను అరికట్టండి



అటవీశాఖ రాష్ట్ర ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ చలపతిరావును సత్కరిస్తున్న అటవీశాఖ, ఏపీ టాస్క్‌ఫోర్స్ అధికారులు

తిరుపతి కల్చరల్: ఎర్రచందనం అక్రమ రవాణాను అరికట్టడానికి అటవీ, స్పెషల్ టాస్క్‌ఫోర్స్ బలగాలు అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని అటవీ శాఖ రాష్ట్ర అటవీశాఖ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ పీవీ చలపతిరావు ఆదేశించారు. తిరుపతి బయోట్రిమ్‌లో సోమవారం తిరుపతి, కర్నూల్ సర్కిళ్ల అటవీ, ఏపీ టాస్క్‌ఫోర్స్ అధికారులతో ఆయన సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శేషాచలం అడవుల్లో వ్యూహాత్మకంగా కూబింగ్ నిర్వహించాలని, స్మగ్లర్లను అడవిలోకి రానీయకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. అలాగే స్మగ్లర్ల నుంచి స్వాధీనం చేసుకుంటున్న ఎర్రచందనం దుంగలను ఎప్పటికప్పుడు గోదాముల్లో భద్రపరచాలన్నారు. పట్టా భూముల్లో ఎర్రచందనం సాగు, స్థానిక మార్కెట్లలో విక్రయాలపై దృష్టి సారించాలన్నారు. కళాకారులు, కొయ్య బొమ్మలు తయారుచేసే వారితో ఎర్రచందనం ఉపకరణాల తయారీ, మార్కెటింగ్ కోసం సాధ్యాసాధ్యాలను పరిశీలించాలన్నారు. ఈ సమావేశంలో అటవీశాఖ తిరుపతి సర్కిల్ సీఎఫ్ సెల్వం, కర్నూలు సర్కిల్ సీఎఫ్ కృష్ణమూర్తి, ఏపీ టాస్క్‌ఫోర్స్ ఇన్‌చార్జ్, తిరుపతి జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు, టాస్క్‌ఫోర్స్ ఎస్పీ శ్రీనివాస్, డీఎఫ్‌వో పవన్‌కుమార్ రావు, ఎర్రచందనం గోదాముల డీఎఫ్ రవిశంకర్ శర్మ, తిరుపతి ఫ్లైయింగ్ స్క్వాడ్ డీఎవో రామకొండారెడ్డి పాల్గొన్నారు.

'నాట్యమయూరి'కి అభినందన



దీపికను సత్కరిస్తున్న టీటీడీ డీఈఓ, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు

తిరుపతి సిటీ: టీటీడీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎస్‌జీఎస్ హైస్కూల్లో పదవ తరగతి చదువుతున్న దీపిక నృత్యంలో రాణిస్తూ నాట్యమయూరి బిరుదు కైవసం చేసుకోవడం గర్వకారణమని టీటీడీ డీఈఓ వెంకట సునీల్ అభినందించారు. సోమవారం ఎస్‌జీఎస్ స్కూల్లో దీపికకు ప్రత్యేక అభినందన సభ ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా టీటీడీ డీఈఓ మాట్లాడారు. అండమాన్‌లో ఇటీవల నిర్వహించిన శాస్త్రీయ నృత్య పోటీలలో దీపిక ప్రథమ స్థానం సాధించడం, ఈ ఏడాది డిసెంబర్‌లో మలేషియాలో నిర్వహించనున్న సాంస్కృతిక పోటీలలో పాల్గొనే అవకాశం లభించడం అభినందనీయమన్నారు. దీపికను ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ప్రత్యేకంగా అభినందించి సత్కరించారు.

మా సమస్యలను పరిష్కరించండయ్యా



డిప్యూటీ కమిషనర్ అమరయ్యకు వినతిపత్రం అందజేస్తున్న ఫిర్యాదుదారుడు

తిరుపతి తుడా: స్థానికంగా ఎదుర్కొంటున్న తమ సమస్యలను పరిష్కరించండంటూ పలువురు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో అధికారులను కలిసి విన్నవించారు. తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని డిప్యూటీ కమిషనర్ అమరయ్య నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నేరుగా కలిసి సమస్యలను తెలియజేశారు. స్పందనకు 22 మంది, డయల్ యువర్ కమిషనర్ ద్వారా ఏడుగురు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అనధికారిక నిర్మాణాలను అడ్డుకోవాలని, యూడీఎస్ సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ శ్యామ్సుందర్, డీసీపీ ఖాన్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, మున్సిపల్ ఇంజనీర్లు తులసీకుమార్, గోమతి, రెవెన్యూ ఆఫీసర్లు సేతుమాధవ్, రవి వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

వర్క్ కాంట్రాక్ట్ ఉద్యోగులకు వేతనాలు పెంచరూ!



రిజిస్ట్రార్‌కు వినతి పత్రం ఇస్తున్న యూనియన్ నాయకులు

తిరుపతి సిటీ: ఎస్వీయూలో పనిచేస్తున్న వర్క్ కాంట్రాక్ట్ ఉద్యోగులకు వేతనాలు పెంచాలని సీఐటీయూ, ఆల్ యూనివర్సిటీస్ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ నాయకులు సోమవారం వర్సిటీ రిజిస్ట్రార్ భూపతి నాయుడుకు వినతి పత్రం ఇచ్చారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎస్ జయచంద్ర, ఆల్ యూనివర్సిటీస్ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కోశాధికారి గండికోట నాగ వెంకటేష్ మాట్లాడారు. పదేళ్లుగా వర్క్ కాంట్రాక్ట్ కింద కార్మికులు పనిచేస్తున్నారని, ప్రతి ఏటా కనీస వేతన కమిటీ ప్రకారం వేతనం పెంచాల్సి ఉందన్నారు. ప్రతి కార్మికునికి రూ.538 ప్రభుత్వ నిర్ణయించిన ప్రకారం వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనివర్సిటీ వర్క్ కాంట్రాక్ట్ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు రాజేంద్ర, కార్యదర్శి మురుగయ్య, కోశాధికారి గణేష్, కమిటీ సభ్యులు సుమతమ్మ, మీనా, ధరణి, కళావతి, రాధమ్మ , కృష్ణవేణి సెల్వి, రవి, వెంకటస్వామి, ముని తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్ విద్యార్థులకు వైద్య పరీక్షలు చేయించరూ!



అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్‌కు వినతిపత్రం ఇస్తున్న వైఎస్సార్‌సీపీ ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షుడు తలారీ రాజేంద్ర

– వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ వినతి

తిరుపతి అర్బన్: సాంఘిక సంక్షేమ గృహాల్లోని విద్యార్థులకు సరైన వైద్య పరీక్షలు చేయించాలని వైఎస్సార్‌సీపీ ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షుడు తలారీ రాజేంద్ర డిమాండ్ చేశారు. సోమవారం ఆయన అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ అధికారి శ్యామ్‌సుందర్‌కు వినతిపత్రం ఇచ్చి మాట్లాడారు. తాజాగా మన్యం జిల్లాలో కామెర్ల వ్యాధి బారిన పడి ఇద్దరు హాస్టల్ విద్యార్థులు మృతి చెందడం కలచివేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఉదంతం నేపథ్యంలో హాస్టల్ విద్యార్థులకు వైద్య పరీక్షలు చేయాలని, పౌష్టికాహారం పెట్టేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నేతలు మురళి, పునీత్, శివకుమార్, జ్యోతి, జయప్రకాష్, ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత ఉపాధ్యాయుల వితరణ



గ్రంథాలయానికి పుస్తకాలను వితరణ చేస్తున్న విశ్రాంత ఉపాధ్యాయులు

తిరుపతి సిటీ: స్థానిక బైరాగి పట్టెడలోని మహాత్మాగాంధీ మున్సిపల్ హైస్కూల్‌లో సోమవారం నూతన గ్రంథాలయాన్ని ప్రధానోపాధ్యాయులు టి పరంధామనాయుడు, దాతలు, విశ్రాంత ఉపాధ్యాయిని కే పద్మావతి, చంగల్‌రావు ప్రారంభించారు. లైబ్రరీ పుస్తకాల కోసం విశ్రాంత ఉపాధ్యాయిని పద్మావతి రూ.10వేలు, విశ్రాంత తెలుగు ఉపాధ్యాయులు, రచయిత కవి కిట్టన్న గ్రంథాలయానికి పలు పుస్తకాలు వితరణగా ఇచ్చారు.ఉపాధ్యాయులు, విద్యార్థులు దాతలకు కృతజ్ఞతలు తెలిపారు.

టెండర్ల ఆహ్వానం

తిరుపతి అన్నమయ్య సర్కిల్: టీటీడీ ఎంప్లాయిస్ కో–ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ సభ్యులకు దీపావళి కానుకగా ట్రావెల్ బ్యాగులను ఇవ్వనున్నామని, దీనికిగాను ఆసక్తి కలిగిన కంపెనీల నుంచి టెండర్లను ఆహ్వానిస్తున్నట్టు అధ్యక్షుడు తలారి మహేష్ తెలిపారు. సోమవారం సాయంత్రం స్థానిక సొసైటీ కార్యాలయంలో సమావేశం నిర్వహించి ఆయన మాట్లాడారు. టీటీడీ అధికారులు, సహకారశాఖ అధికారులు, ప్రముఖులకు రూ.500 విలువ కలిగిన బహుమతిని ఏడాదికి ఒక్కసారి గరిష్టంగా వంద మందికి ఇవ్వాలనే నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. ఈ నెల 10వ తేదీలోపు బ్యాగుల సరాఫరాకు సంబంధించి ఆయా కంపెనీలు కొటేషన్లు ఇవ్వాలని కోరారు. సమావేశంలో ఉపాధ్యక్షుడు రాజకుమార్, డైరెక్టర్లు ఏ.ముని వెంకటరెడ్డి, చీర్ల కిరణ్, ఎస్వీ. దొరైరాజు, ఆర్.కిశోర్ కుమార్ పాల్గొన్నారు.

సమస్యలపై గ్రామసభలో నిలదీత



దుర్గసముద్రంలో నిర్వహిస్తున్న గ్రామ సభ

తిరుపతి రూరల్: మండలంలోని దుర్గసముద్రం పంచాయతీలో సోమవారం ఉప సర్పంచ్ చిరంజీవి అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. సమస్యలపై గ్రామస్తులు ఇన్‌చార్జ్ పంచాయతీ కార్యదర్శి మురళి నిలదీశారు. పంచాయతీలో ఫాగింగ్ చేయడం లేదని, వీధి లైట్లు ఏర్పాటు చేయాలని కోరినా పట్టించుకోవడం లేదని, అభివృద్ధి అన్నదే లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ఎనిమిది గ్రామసభలకు సర్పంచ్‌గానీ, వార్డు సభ్యులుగానీ హాజరు కాలేదని, రెగ్యులర్ పంచాయతీ సెక్రటరీ లేకపోవడంతో సమస్యలను ఎవరూ పట్టించుకున్న పాపానపోవడం లేదని నిరసించారు. గ్రామ సచివాలయానికి వెళ్లే రహదారి ఇరువైపులా పిచ్చిమొక్కలు పెరిగి పోయాయని, వాటిని తొలగించాలన్నారు. గ్రామంలోకి ఇసుక లోడ్లతో వచ్చే టిప్పర్లను కట్టడి చేయాలని, లేని పక్షంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

నోటీస్ బోర్డు

- శ్రీతాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో ఉదయం 8.30 నుంచి మహా చండీహోమం.
- సీఐటీయూ ఆధ్వర్యంలో ఉదయం 10.30 గంటలకు పాత మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన.
- ఏ.రంగంపేట వద్ద ఏర్పాటు చేసిన హెలిపాడ్‌కు ఉదయం 11.10 గంటలకు సీఎం చేరుకుంటారు. అక్కడ నుంచి రోడ్డు మార్గంలో నారావారిపల్లె కార్యక్రమానికి హాజరై తిరిగి మధ్యాహ్నం 1.40 గంటలకు అదే హెలిపాడ్‌కు చేరుకుని విజయవాడకు తిరుగు ప్రయాణమవుతారు.
- రామకృష్ణ థియేటర్ సమీప సర్కిల్లోని మహర్షి విగ్రహానికి ఉదయం 9.30 గంటలకు జిల్లా కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ పుష్పాంజలి ఘటిస్తారు.

అంగన్‌వాడీ కేంద్రానికి అవార్డు

భాకరాపేట: పరిశుభ్రత, శిశు సంరక్షణ, పోషకాహారం, సృజనాత్మక సేవల్లో చిన్నగొట్టిగల్లు–1 అంగనవాడీ కేంద్రం జిల్లా స్థాయి స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర అవార్డుకు ఎంపికైంది. జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా అంగనవాడీ టీచర్ కిరణ్మయి అవార్డు అందుకుంది. ఐసీడీఎస్ సీడీపీఓతోపాటు సూపర్‌వైజర్ సుహాసిని, అంగన్‌వాడీ కేంద్రం సహాయకురాలు మునిలక్ష్మి, సిబ్బంది, మహిళా సమాఖ్య సిబ్బంది అభినందించారు.

ప్రభుత్వ న్యాయవాదిగా దశరథ



తిరుపతి లీగల్: తిరుపతి సీనియర్, జూనియర్ సివిల్ జడ్జి కోర్టులలో ప్రభుత్వం తరఫున సివిల్ కేసులు వాదించడానికి అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్(ఏజీపీ)గా న్యాయవాది జే.దశరథను నియమిస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన మూడేళ్లపాటు ఏజీపీగా కొనసాగుతారని ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది. ఆయన తిరుపతిలో 20 ఏళ్లకు పైగా న్యాయవాదిగా ఉన్నారు.

టీటీడీ ఈవోను కలిసిన ప్రెస్‌క్లబ్ కమిటీ

తిరుపతి అన్నమయ్య సర్కిల్: తిరుపతి ప్రెస్‌క్లబ్ కమిటీ సభ్యులు టీటీడీ ఈవో అనిల్ కుమార్ సింఘాల్‌ను సోమవారం స్థానిక టీటీడీ పరిపాలన భవనంలో మర్యాదపూర్వకంగా కలిశారు. బ్రహ్మోత్సవాలను విజయవంతంగా నిర్వహించినందుకు పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. శ్రీవారి బ్రహ్మోత్సవాల అనంతరం పాత్రికేయులకు కల్పించే శ్రీవారి దర్శన భాగ్యాన్ని త్వరితగతిన ఏర్పాటుచేయాలని కోరారు. దీనిపై ఈవో సానుకూలంగా స్పందించి త్వరలోనే దర్శనం ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఆమేరకు తగిన ఏర్పాట్లు చేయాలని టీటీడీ చీఫ్ పీఆర్ఓ రవికి సూచించారు.

సుప్రీం కోర్టు సీజేఐపై దాడి శోచనీయం

తిరుపతి కల్చరల్: సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయిపై సీనియర్ న్యాయవాది కోర్టులో చెప్పుతో దాడికి ప్రయత్నించడం శోచనీయమని అంబేడ్కర్ భవన్ కమిటీ చైర్మన్ పి.పరమశివన్ ఒక ప్రకటనలో ఖండించారు. సమాజానికి మార్గదర్శకంగా ఉండాల్సిన న్యాయవాది ఇలా చేయడాన్ని భారత పార్లమెంట్, సుప్రీం కోర్టు, ప్రజాస్వామ్యంపై దాడిగా పరిగణించి దేశద్రోహం కేసు నమోదు చేసి శిక్షించాలని డిమాండ్ చేశారు.



